
సాక్షి
కాకినాడ
గురువారం | 29 | జూన్ | 2023



డెల్టాలకు నీరు విడుదల
ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి బుధవారం తూర్పు డెల్టాకు 1,860, మధ్య డెల్టాకు 1,340, పశ్చిమ డెల్టాకు 3,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 8.75 అడుగులకు నీటి మట్టం చేరింది.



ప్రమాణాలు పెంచే ప్రణాళిక
ప్రభుత్వం విద్యా ప్రమాణాలను పెంచేందుకు పలు రకాల సంస్కరణలను ప్రవేశ పెడుతోంది. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో విద్యా సంస్కరణలను ప్రవేశ పెట్టారు.

8లో

గరిష్ఠం/కనిష్ఠం
39.5°/26.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	39.5	26.0
కాకినాడ	37.0	27.0
అమలాపురం	39.0	25.0

న్యూస్‌రీల్

ఆటియా పాటియా పోటీలకు విద్యార్థులు ఎంపిక




రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన శ్రీప్రకాష్ విద్యార్థులు

తుని: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి ఆటియా పాటియా పోటీల్లో స్థానిక శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్టు పాఠశాల హెచ్ఎం బి.సీతారాణి తెలిపారు. తుని శ్రీప్రకాష్‌లో బుధవారం నిర్వహించిన అండర్-14 బాలికల విభాగంలో ఎన్.జితేంద్ర, జి.గణేష్, ఎం.వర్షిత్, బి.నీలిమ, సీహెచ్ లేఖన, కె.ప్రీతం ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. వచ్చే నెల 1, 2వ తేదీల్లో తుని బాలికల జూనియర్ కళాశాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, ప్రిన్సిపాల మూర్తి అభినందించారు.

పోస్టల్ సూపరింటెండెంట్‌గా శ్రీనివాస్


బాలాజీచెరువు(కాకినాడ సిటీ): విశాఖకు బదిలీ అయిన కాకినా పోస్టల్ సూపరింటెండెంట్ డీయూఎస్ నాగేశ్వరరెడ్డిట్ ఆశాఖ ఉద్యోగులు బుధవారం వీడ్కోలు పలికారు. ఆలిండియా పోస్టల్ ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనకు వీడ్కోలు పలికి కొత్తగా విధుల్లో చేరిన సీహెచ్ శ్రీనివాస్‌కు స్వాగతం పలికారు. తమ సమస్యలను కొత్త అధికారి దృష్టికితీసుకొచ్చారు. పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం రూ.66.30 లక్షలు



ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి హుండీలను బుధవారం లెక్కించగా రూ.66,30,302 ఆదాయం వచ్చినట్లు ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. 34 రోజులకు హుండీలను లెక్కించగా ప్రధాన హుండీల నుంచి రూ.49,48,114, అన్న ప్రసాదం హుండీల నుంచి రూ.16,82,688 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. బంగారం 82 గ్రాములు, వెండి 481 గ్రాములు, విదేశీ కరెన్సీ వచ్చినట్లు వివరించారు. ఆలయ క్షేత్రపాలకుడు శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయ హుండీలను 34రోజులకు లెక్కించగా రూ.1,41,095 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, పలివెల శ్రీమందేశ్వరస్వామి ఆలయం అసిస్టెంట్ కమిషనర్ సింగం రాధ, పలివెల ఉమా కొప్పేశ్వరస్వామి ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎస్‌వీ ప్రసాదరాజు, పొడగట్లపల్లి ఉప్పలపాటి జానకీయమ్మ అన్నదాన సత్రం ఈఓ మీసాల రాధాకృష్ణ పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు.

ఆశ ఉంటే.. శ్వాస వెంటే..



- ఒక వ్యక్తి పాజిటివ్ ఆలోచనతో ఏర్పడిన సంస్థ
- హెచ్ఐవీ పాజిటివ్ బాధితుల బాగుకు అవిరళ కృషి
- నాణ్యమైన జీవితాన్ని అందించడమే లక్ష్యం
- కోస్టల్ నెట్‌వర్క్ ఫర్ పాజిటివ్ పీపుల్ సంస్థ సేవలు
- ఉమ్మడి జిల్లాలో 13 వేల మంది సభ్యులు

చీకటిమయం చేసే అనుకోని సంఘటనలు జీవిత చరమాంకానికి చేరువ చేస్తాయి. బీ పాజిటివ్ అనుకుంటూ బతకాలన్నా తెలియని భయాందోళనల్ని రేకెత్తిస్తాయి. యావత్ జీవన గమనాన్నే మార్చేసే అనుకోని మలుపులు జీవితాన్ని నిర్వీర్యం చేస్తాయి. అటువంటి చేదు వాస్తవాలకు ఎదురొడ్డి నిలిచేందుకు ఓ స్వచ్ఛంద సంస్థ ఊతమిస్తోంది. ఇంకెన్నాళ్లలే అన్న నిర్వేదానికి ఉన్నన్నాళ్లు అన్న బదులిస్తోంది. డియర్ పాజిటివ్... బి పాజిటివ్... అంటూ భరోసా ఇస్తోంది.

(డెస్క్-రాజమహేంద్రవరం): సరిగ్గా 27 ఏళ్ల క్రితం, 1996లో విజయవాడ సమీపంలోని పామర్రులో కాకినాడ సామర్లకోటకు చెందిన 27 ఏళ్ల ఓ యువకుడు ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేరాడు. తన భావి జీవితంపై కొండంత ఆశతో వృత్తి జీవితాన్ని ప్రారంభించాడు. ఊహించని రీతిలో ఓ రోజు హెచ్ఐవీ మహమ్మారి బారిన పడినట్లు వైద్య నివేదికల్లో వెల్లడైంది. కాలికింద భూమి కదలినట్లయింది. పనిచేస్తున్న సంస్థ కూడా ఆ విషయాన్ని తెలుసుకొని ఉద్యోగానికి స్వచ్ఛంద విరమణ చేయాలని ఒత్తిడి చేసింది. ఉద్యోగం మానిపించేసింది. స్వగ్రామం సామర్లకోటకు చేరాడు. మనోవేదన నుంచి బయటపడి తన లాంటి బాధితుల జీవన గమనాల్ని పరిశీలించాలనుకున్నాడు. ఈ క్రమంలో తన లాంటి బాధితుల బాగోగులు చూసుకునేందుకు ఓ జాతీయ స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చిందని తెలుసుకున్నాడు. సామర్లకోటకు వచ్చిన ఆ సంస్థ పెద్దలతో మమేకమయ్యాడు. వారు కూడా హెచ్ఐవీ బాధితులేనని తెలుసుకుని ఆశ్చర్యపోయాడు. హెచ్ఐవీ బారిన పడినా, చక్కటి హోదాలో, ఆరోగ్యకరమైన జీవన విధానంతో బతకొచ్చన్న భరోసా కలిగింది. ఆ సంస్థ చెన్నైలో నిర్వహించిన ఓ సమావేశం అతడి జీవిత గమనాన్ని మార్చేసింది. ఆ స్ఫూర్తితో, సామర్లకోట వచ్చిన ఢిల్లీ పెద్దల సహకారంతో తన లాంటి బాధితుల జీవన నాణ్యతను మెరుగుపరిచేందుకు పాటు పడాలని నిర్ణయించుకున్నాడు.



సంస్థ సభ్యులతో తోటి బాధితులకు అందిస్తున్న సేవలను సమీక్షిస్తున్న రామ్మోహన్

ఒక్కరితో ప్రారంభమై..

జాతీయ నెట్‌వర్క్‌కు అనుబంధంగా తన 34వ ఏట 2003లో నాటి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో సేవలందించేందుకు స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశాడు. ఈ సంస్థ ద్వారా హెచ్ఐవీ రోగులకు నాణ్యమైన జీవితాన్ని అందించి జీవన ప్రమాణంతో పాటు జీవిత కాలాన్ని కూడా మెరుగుపరిచే బాధ్యతను తలకెత్తుకున్నాడు. వేలాది బాధితులే సభ్యులుగా చేరిన ఆ సంస్థ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొంది, ఎయిడ్స్ నియంత్రణ మండలి విభాగానికి అనుబంధంగా సేవలను అందిస్తోంది. నాటి పాతికేళ్ల ఆ యువకుడి పేరే మేడిశెట్టి రామ్మోహన్ రావు. ఆయన స్థాపించిన ఆ సంస్థ పేరే 'కోస్టల్ నెట్‌వర్క్ ఫర్ పాటిజివ్ పీపుల్'. ప్రస్తుతం రామ్మోహన్ వయసు 54 సంవత్సరాలు, హెచ్ఐవీతోనే 29 ఏళ్లుగా నాణ్యమైన జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఏడుగురితో కలిసి సంస్థకు కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి, ఇరవై ఏళ్లుగా సేవలందిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 13 వేల మంది సంస్థలో సభ్యులుగా ఉన్నారు.

ఎక్కువ కాలం బతికేలా...

కోస్టల్ నెట్‌వర్క్ ఫర్ పాజిటివ్ పీపుల్ ప్రధాన లక్ష్యం బాధితుల జీవన నాణ్యతను మెరుగుపరచడం. ఇందుకు శాస్త్రీయ విధానాలను అనుసరించి సఫలీకతమైంది. ఇమ్యూనో డెఫీషియన్సీ వైరస్ వైరల్ లోడ్ తగ్గేలా మందులు బాధితులతో వాడించడం, అంతర్జాతీయ ప్రమాణాలతో సాగుతున్న హెచ్ఐవీ నియంత్రణ పరిశోధనలు, ఉత్పత్తుల ప్రయోజనాలను బాధితులకు అందించి వారి జీవనాన్ని వృద్ధి చేయడం సంస్థ లక్ష్యాల్లో ఒకటి. పోషకాహార ప్రాధాన్యం, మద్యం, ధూమపానం వంటి దురలవాట్లను నివారించి అనుబంధ ఆరోగ్య సమస్యలకు గురికాకుండా చర్యలు తీసుకుంటుంది.

ఇవీ సేవలు

- బాధితులను కంటికి రెప్పలా కాచి కాపాడుకుంటున్న రామ్మోహన్ బృందం వారి బాగోగులను అనునిత్యం పర్యవేక్షిస్తుంది.
- రెండు దశాబ్దాల్లో వందకుపైగా హెచ్ఐవీ జంటలను వివాహ బంధంతో ఏకం చేసింది.
- బాధితుల విద్యను ప్రోత్సహిస్తూ బోధనా తరగతులు నిర్వహిస్తోంది. చదువుకున్న వారికి, నిరక్షరాస్యులకు కూడా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది.
- సీడీ 4 సహా వైరల్ లోడ్ పరీక్షలు ఎప్పటికప్పుడు చేయించేలా చర్యలు తీసుకుంటుంది. నిత్యం వైద్య సేవలు అందేలా కీలకంగా వ్యవహరిస్తుంది.
- కాకినాడ పీఆర్ కళాశాల రోడ్డులో ఉన్న సంస్థ కార్యాలయంలో 25 మంది బాధితులకు ఉద్యోగాలు కల్పించారు. ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో సంస్థ సిఫారసుతో 150 మంది ఉద్యోగాలు పొందారు.

బాధితులంతా కలిసి బాధితుల కోసం..



హెచ్ఐవీ మధుమేహం వంటి ఓ దీర్ఘకాలిక వ్యాధి. అదే తరహాలో జీవితాంతం మందులు వాడుకొని సుదీర్ఘ కాలం బతకవచ్చనే భరోసా ఇవ్వడమే మా ఉద్దేశం. అందుకు అన్ని చర్యలూ తీసుకుంటాం. బాధితులంతా కలిసి బాధితుల కోసం శ్రమిస్తున్న ఆదర్శ సంస్థ. జాతీయ నెట్‌వర్క్ నిర్వహణ సహకారం అందిస్తోంది. ప్రభుత్వ అనుబంధంగా సేవలందిస్తున్నాం. హెచ్ఐవీ అంటే మరణం అనే మాట మరచిపోవాలి.

– మేడిశెట్టి రామ్మోహన్‌రావు, కోస్టల్ నెట్‌వర్క్ ఫర్ పాటిజివ్ పీపుల్

వెలకట్టలేని సేవలు



బాధితుడి సంకల్పం నుంచి పుట్టిన సంస్థ ఇది. వేలాది బాధితులు సభ్యులుగా కొనసాగుతున్నారు. ప్రభుత్వ గుర్తింపు పొంది ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి పరిధిలో అత్యుత్తమ సేవలు అందిస్తోంది. బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న పింఛను ఇతర సదుపాయాలను వారికందేలా సంస్థ చర్యలు తీసుకుంటుంది. ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహకారం ఉంది. బాధితులు కార్పొరేట్ సేవలకు పరుగులు తీసి ఆర్థిక భారానికి గురికావద్దు. స్వచ్ఛంద సంస్థల సేవలు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ రమేష్, ఎయిడ్స్, కుష్ఠువ్యాధుల నివారణ అధికారి

దేశానికే దిక్సూచి అమ్మ ఒడి

- పథకం కింద విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.280కోట్ల మేర జమ
- 1,86,708 మంది విద్యార్థులకు ప్రయోజనం
- కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ గీత..ప్రజాప్రతినిధులు



అమ్మఒడి చెక్కును విడుదల చేస్తున్న ఎంపీ వంగా గీత. కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా, జడ్పీ చైర్మన్ విప్పర్తి, ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

కాకినాడ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో 'అమ్మ ఒడి' దేశానికి దిక్సూచి వంటిదని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. జగనన్న అమ్మ ఒడి జిల్లాస్థాయి కార్యక్రమం కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన స్థానిక స్మార్ట్‌సిటీ సమావేశ మందిరంలో బుధవారం జరిగింది. కార్యక్రమానికి ఎంపీ గీత, కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఆర్డీవో సత్యనారాయణ, డీఈవో కేఎస్ వీఎస్ అన్నపూర్ణ తదితరులు హాజరయ్యారు. తొలుత కార్యక్రమాన్ని ముఖ్య అతిథులు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అమ్మ ఒడి చెక్కును ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, అధికారులు విడుదల చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాలుగో విడత జగనన్న అమ్మ ఒడి నిధులను విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని కురుపాంలో ప్రారంభించగా ఇక్కడ ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ సీఎంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఉండటం రాష్ట్రంలోని పిల్లలందరి అదృష్టమని పేర్కొన్నారు. విద్య, వైద్యం కోసం కోసం పేదలు రుణాలు చేయాల్సిన పరిస్థితి గతంలో ఉండేదని. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. అమ్మ ఒడిని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రూ.280 కోట్ల లబ్ధి: కలెక్టర్

జిల్లాలో అమ్మఒడి ద్వారా ఈ ఏడాది 1,86,708 మంది తల్లులకు రూ.280.06 కోట్ల మేరకులబ్ధి చేకూరుతుందని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తెలిపారు. విద్యార్థుల చదువుకు పేదరికం అవరోధం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలుచేస్తున్నట్లు తెలిపారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. మనబడి నాడు-నేడు ద్వారా జిల్లాలో ఇప్పటికే రూ. 335 కోట్ల ఖర్చుతో పనులు పూర్తిచేసినట్లు వివరించారు. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు మాట్లాడుతూ జగనన్న అమ్మ ఒడి పథకం ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.

విద్యభారం కాకూడదనే : ద్వారంపూడి

విద్యారంగ ప్రాధాన్యాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న విద్యా కానుక, జగనన్న విద్యా దీవెన, జగనన్న అమ్మ ఒడి వంటి వివిధ పథకాలను అమలుచేస్తున్నారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా ప్రతి తల్లి ఖాతాలో రూ. 13 వేలు చొప్పున జమవుతోందని తెలిపారు. కాకినాడ సిటీ పరిధిలోనే జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా 25,170 మంది లబ్ధి పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.

గోవధ నిషేధం పటిష్టంగా అమలు



ఎస్.సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: హైకోర్టు ఉత్తర్వుల మేరకు, గోవధపై నిషేధం విధించినట్లు జిల్లా ఎస్పీ సుబ్రమణి సతీష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిషేధిత గోవధ, జంతు సంరక్షణ చట్టం-1977 మార్గదర్శకాలను అనుసరించి నిషేధాన్ని కొనసాగిస్తున్నామన్నారు. సాధారణ రోజులతో పాటు పర్వదినాల్లో గోవధతో పాటు గోవుల అక్రమ రవాణాను చట్టరీత్యా నేరంగా పరిగణిస్తామని ఎస్పీ తెలిపారు. గోవధ నిర్మూలనకు అదనపు ఎస్పీ స్థాయి అధికారిని నియమించినట్లు ఆయన తెలిపారు. జిల్లా నోడల్ అధికారిగా అదనపు ఎస్పీ శ్రీనివాస్ వ్యవహరిస్తారని ఆయన అన్నారు. ప్రార్థనా మందిరాలు, బహిరంగ ప్రదేశాల్లో సైతం వధను నిషేధించినట్లు తెలిపారు. గోవధ, అక్రమ తరలింపునకు సంబంధించిన సమాచారాన్ని డయల్ 100 ద్వారా లేదా 94949 33233 నంబరుకు వాట్సాప్ ద్వారా పోలీసులకు తెలపాలని ప్రజలను కోరారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ అన్నారు.

వాస్తువానికి దగ్గరగా దర్బార్

- మరింత విశాలంగా మార్పులు
- గాలి వెలుతురు వచ్చేలా ఈశాన్యాన గోడలు తొలగింపు
- నేడే మహా విష్ణువుగా సత్యదేవుని దర్శనం
- ఈఓ చంద్రశేఖర్ అజాద్



గాలి వెలుతురు వచ్చేలా ఏర్పాటు చేసిన మెష్



రెండు మండపాల మధ్య గోడను తొలగించి ఫ్లోరింగ్ సరిచేయడంతో విశాలంగా కనిపిస్తున్న దర్బారు మండపం

అన్నవరం: రత్నగిరీశుని ఆలయంలో ఉత్సవ మూర్తులు కొలువై ఉండే దర్బార్ మండపాన్ని వాస్తుపరంగా, భక్తులకు సౌకర్యవంతంగా గతం కంటే రెట్టింపు విశాలంగా తీర్చిదిద్దారు. తొలి ఏకాదశి సందర్భంగా గురువారం ఈ మండపంలో సత్యదేవుడు మహావిష్ణు రూపంలో చతుర్భుజాలు, శంఖుచక్రనామాలు, గద, శార్ణంతో, వక్షస్థలాన లక్ష్మీదేవి సమేతుడై కనువిందు చేయనున్నారు.

గతంలో సత్యదేవుని దర్శనానంతరం భక్తులు దర్బారు మండపంలోని దేవేరి సమేతుడైన స్వామివారి ఉత్సవమూర్తులను దర్శించి పూజలు చేసేవారు. ఈ ఉత్సవమూర్తులను స్వామివారి ప్రధానాలయంలోకి మార్చారు. దానికి తోడు ఈ మండపంలో ఆయుష్య, లక్ష్మీ హోమాలు నిర్వహిస్తుండడం వల్ల మండపం పొగబారి కళ తప్పింది. దీనికి తోడు వాస్తు లోపాలను గుర్తించి మార్చారు.

దర్బారు మండపానికి పూర్వ వైభవం

ఈ మండపానికి పూర్వ వైభవం వచ్చేలా ఈఓ చంద్రశేఖర్ అజాద్ పలు మార్పులు చేయించారు. ఏనుగుల మండపం కన్నా దర్బారు మండపం ఫ్లోరింగ్ వాస్తుకు విరుద్ధంగా ఎత్తుగా ఉన్న విషయాన్ని గుర్తించారు. అంతే కాకుండా రెండు మండపాల మధ్య గోడను తీసివేయడం ద్వారా దర్బారు మండపం మరింత విశాలమవడంతో పాటు భక్తులకు మరంత సౌకర్యవంతంగా ఉంటుందని భావించి ఈ నెల మొదటి వారంలో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ఈశాన్య భాగంలో గోడలు ఉండడం వల్ల గాలి, వెలుతురు కూడా రావడం లేదని భావించి ఆ గోడలను తీసివేసి మెష్ ఏర్పాటు చేశారు. ఈ పనులన్నీ దాదాపుగా పూర్తయ్యాయి. వాస్తుకు విరుద్ధంగా ఏనుగుల మండపం ఫ్లోరింగ్ కన్నా ఎత్తుగా ఉన్న ఫ్లోరింగ్ ను తీసి కొంచం దిగువకు గ్రానైట్ ఫ్లోరింగ్ చేయించారు. దీంతో ప్రస్తుతం ఈ మండపం భక్తులకు చాలా సౌకర్యవంతంగా ఉంది.

దర్బారు మండపంలో ఉత్సవమూర్తులు

కాగా, తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా గురువారం నుంచి జూలై మూడో తేదీ వరకు దర్బారు మండపంలో విష్ణుమూర్తి అలంకరణలో నిలువెత్తు రూపంలో సత్యదేవుడు దర్శనమివ్వనున్నారు. అలాగే స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తుల దర్శనానికి కూడా భక్తులను అనుమతించనున్నారు. మూడో తేదీన ఆషాఢపూర్ణిమ సందర్భంగా అమ్మవారిని శాకంబరిగా అలంకరించనున్నారు. గురువారం తీర్థప్రసాదాల పంపిణీకి అనుగుణంగా మండపం వద్ద క్యూలైన్లు నిర్మించనున్నారు.

భక్తుల సౌకర్యం కోసమే



సత్యదేవుని దర్శనం అనంతరం నేరుగా దర్బారు మండపం వద్దకు వచ్చి అక్కడ స్వామి, అమ్మవారిని దర్శించి తీర్థ, ప్రసాదాలు స్వీకరించేందుకు వీలుగా మండపాన్ని విశాలం చేశాం. వాస్తుపరంగా మరిన్ని మార్పులు చేశాం. ఈ మార్పులు భక్తులకు మరింత సౌకర్యాన్ని కల్పిస్తాయి.

– ఈఓ. చంద్రశేఖర్ అజాద్

22 తాగునీటి ప్యాకెట్ల యూనిట్ల మూసివేత

అధికారులకు కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశం



జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జిల్లాలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) నిబంధనలు పాటించని 22 డ్రింకింగ్ వాటర్ ప్యాకేజ్ యూనిట్లను మూసివేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. పరిశ్రమలు, ఏపీఐఐసీ, గ్రౌండ్ వాటర్, రవాణా, అగ్నిమాపక, పంచాయతీ, ఫ్యాక్టరీస్, పొల్యూషన్, ఫుడ్ కంట్రోల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పటిష్టంగా అమలయ్యేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) నిబంధనలు పాటించని ప్యాకేజ్ డ్రింకింగ్ వాటర్ యూనిట్లను మూసివేయాలని ఆదేశించారు. వీరికి గత ఏప్రిల్, మే నెలల్లో నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ యూనిట్లను నిర్వహించేవారు తప్పనిసరిగా గ్రౌండ్ వాటర్ శాఖ అనుమతులు తీసుకోవాలన్నారు. పరిశ్రమల్లో భద్రతతో పాటు పారిశ్రామిక యూనిట్లకు సత్వర అనుమతుల జారీకి అమలులో ఉన్న ఏపీ సింగిల్ డెస్క్ విధానం కింద 18 దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలకు సంబంధించి పారిశ్రామిక అభివృద్ధి విధానాలు, వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం పథకం పరిధిలో 33 యూనిట్లకు వివిధ ప్రోత్సాహకాల కింద రూ. 3.46 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. గత సమావేశంలో తీర్మానించిన అంశాలకు సంబంధించి తీసుకున్న చర్యలపై అధికారులతో చర్చించారు. సమావేశంలో పరిశ్రమలశాఖ జీఎం టి మురళి, ఏడీ కె కృష్ణారావు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డి రాధాకృష్ణ, ట్రాన్స్‌పోర్టు అధికారి పి సాయిప్రసాద్, అగ్నిమాపక అధికారి సురేంద్ర ఆనంద్, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ అధికారి బి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మొన్న ఫెయిల్..
నిన్న స్కూల్ టాపర్!

టెన్త్ రీ వాల్యుయేషన్‌లో బయటపడ్డ ఉపాధ్యాయుడి నిర్వాకం

రామచంద్రపురం రూరల్: పదో తరగతి పరీక్షల్లో పేపర్ వాల్యుయేషన్ చేసిన ఉపాధ్యాయుడి తప్పిదం వల్ల ప్రతిభ గల విద్యార్థి ఫెయిల్ అయిన ఘటన మండలంలోని వెల్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థికి ఎదురైంది. అన్ని సబ్జెక్టుల్లోనూ 90 మార్కులు పైబడిన విద్యార్థి గీసాల దుర్గాప్రశాంత్‌కు మే నెలలో విడుదలైన ఫలితాల్లో సోషల్ స్టడీస్‌లో 15 మార్కులు మాత్రమే వచ్చాయి. పాఠశాల టాపర్‌గా నిలవాల్సిన విద్యార్థి ఫెయిల్ అవ్వడంపై అనుమానం రావడంతో సోషల్ స్టడీస్ సబ్జెక్ట్‌ను రీవాల్యుయేషన్ చేయించగా మంగళవారం ఫలితాన్ని విడుదల చేశారు. ఫలితాల్లో విద్యార్థి మార్కులు 15 నుంచి 94కు పెరగడంతో పాటు మొత్తం మార్కులు 568కు పెరిగి పాఠశాల టాపర్‌గా నిలిచాడు. వాల్యుల్యూషన్ టీచర్ చేసిన తప్పిదానికి పాఠశాల టాపర్ స్థానంలో జగనన్న ఆణిముత్యాలు పథకం ద్వారా పొందాల్సిన గౌరవాన్ని పొందలేక పోయాడు.

కుష్ఠు వ్యాధిని పారదోలాలి



క్షేత్ర స్థాయి పర్యవేక్షణ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కుష్ఠు వ్యాధిని నిర్మూలన కోసం వైద్యాధికారులు సిబ్బంది క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ తిరిగి అనుమానిత కేసులు ఉంటే వారిని పరీక్షించి తగు సూచనలు సలహాలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు సూచించారు. లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపెయిన్‌లో భాగంగా బుధవారం స్థానిక రాజేంద్రనగర్ కాలనీలో ఇంటింటి సర్వేను ఆయన పర్యవేక్షించారు. అనుమానిత మచ్చలు ఉన్న వారిని ఆసుపత్రికి రిఫర్ చేయాలని సిబ్బందికి సూచించారు. సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఒక అనుమానిత మచ్చలు ఉన్న వ్యక్తిని పరీక్షించి సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లా నుంయి కుష్ఠు వ్యాధిని పారదోలాలని ఆయన సిబ్బందికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎస్‌ఎంలు, ఆశా, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాణాలు పెంచే ప్రణాళిక

- డిగ్రీ విద్యలో సమూల సంస్కరణలు
- ఇప్పటి వరకు మూడు సబ్జెక్టులతో
- ఇకపై మేజర్, మైనర్ సబ్జెక్టుల కాంబినేషన్‌తో అండర్ గ్రాడ్యుయేషన్
- ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు



రాయవరం: ప్రభుత్వం విద్యా ప్రమాణాలను పెంచేందుకు పలు రకాల సంస్కరణలను ప్రవేశ పెడుతోంది. ఇప్పటికే ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల స్థాయిలో విద్యా సంస్కరణలను ప్రవేశ పెట్టారు. నూతన విద్యా విధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అండర్ గ్రాడ్యుయేషన్ (యూజీ) విద్యలో సింగిల్ సబ్జెక్టు మేజర్‌గా నూతన విద్యా ప్రణాళిక (కరిక్యులమ్)ను ప్రవేశ పెట్టింది. ఇప్పటి వరకు డిగ్రీలో మూడు సబ్జెక్టుల ప్రధాన కాంబినేషన్‌తో విద్యాబోధన సాగుతుండగా, ఇకపై మేజర్ సబ్జెక్టు ప్రధానంగా డిగ్రీ కొనసాగుతుంది. ఈ విద్యా సంవత్సరం నుంచే నూతన విధానం అమల్లోకి వచ్చింది. ఈ మేరకు విద్యా ప్రణాళికను మార్పు చేస్తూ ఉన్నత విద్యామండలి తీసుకున్న నిర్ణయాన్ని క్షేత్ర స్థాయిలో అమలు చేస్తున్నారు. ఏదైనా ఒక సబ్జెక్టులో విద్యార్థులు సంపూర్ణ నైపుణ్యాలను సాధించే దిశగా విద్యా ప్రణాళికను అమల్లోకి తీసుకువచ్చారు.

సమూల సంస్కరణల దిశగా..

గతంలో అండర్ గ్రాడ్యుయేషన్‌లో బీఏ తీసుకున్న విద్యార్థులకు ప్రధానంగా హిస్టరీ, పొలిటిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ కాంబినేషన్‌తో ప్రధాన సబ్జెక్టులను తప్పనిసరిగా అభ్యసించాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ మూడింటిలో తమకు నచ్చిన ఒక సబ్జెక్టును మేజర్‌గా ఎంపిక చేసుకుంటే, రెండో సెమిస్టర్‌లో యూనివర్సిటీలో అమలు చేస్తున్న దాదాపు 155 కోర్సుల నుంచి విద్యార్థులు తమకు నచ్చిన ఓ మైనర్ సబ్జెక్టును ఎంపిక చేసుకోవచ్చు. ఈ కోర్సుల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కోర్సులు కూడా ఉంటాయి. ఈ రెండు మేజర్, మైనర్ సబ్జెక్టుల్లో ఏదో ఒక దానితో పీజీ విద్య వరకు అభ్యసించేలా సంస్కరణలు చేశారు.

మూడు ప్రధాన డిగ్రీల్లో అమలు

యూజీ విద్యలో మేజర్ సబ్జెక్టుతో పాటు కచ్చితంగా ఓ మైనర్ సబ్జెక్టు చదవాలి. ఉదాహరణకు ఒక సైన్స్ విద్యార్థి మైనర్ సబ్జెక్టుగా ఆర్థిక శాస్త్రం, చరిత్ర, సంగీతం, యోగా, డేటా సైన్స్, మార్కెటింగ్..ఇలా ఇతర ఏ సబ్జెక్టునైనా ఎంపిక చేసుకోవచ్చు. ఆర్ట్స్ విద్యార్థులు మైనర్ కోర్సుల్లో భాగంగా ఇంటర్మీడియెట్ ఆధారంగా తమకు నచ్చిన సబ్జెక్టు తీసుకోవచ్చు. కొత్త విధానాన్ని బీఎస్సీతో పాటు బీఏ, బీకామ్‌లో అమలు చేయనున్నారు. డిగ్రీ పూర్తికాగానే ఉద్యోగ అవకాశాలను పెంపొందించడంతో పాటు ఇంజినీరింగ్‌తో సమానంగా మానవ వనరులను తీర్చిదిద్దేందుకు ఈ విద్యా సంస్కరణలు దోహదం చేస్తాయి. కొత్త విధానంపై డిగ్రీలో చేరే విద్యార్థులకు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ అవగాహన కల్పిస్తున్నారు.

నాలుగో ఏడాది డిగ్రీకి అనుమతి

నూతన జాతీయ విద్యా విధానం-2020ను దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో అమలు చేస్తున్నారు. యూజీసీ ఫ్రేమ్ వర్క్స్ ప్రకారం యూజీ విద్యను రెండు విధాలుగా విభజించారు. మూడేళ్ల డిగ్రీలో 75 శాతం మార్కులు సాధించినవారు రీసెర్చ్ హానర్స్ డిగ్రీ కోర్సులో చేరవచ్చు. ఇది పూర్తి చేసినవారు పీజీ లేకుండా నేరుగా పీహెచ్‌డీ కోర్సుకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. మూడేళ్ల కోర్సులో ఉత్తీర్ణులైతే జనరల్ హానర్స్ కోర్సును అభ్యసించవచ్చు. ఇది పూర్తి చేసిన వారు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో రెండో ఏడాదిలో చేరవచ్చు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో హానర్స్ కోర్సులను అందించేందుకు నిబంధనలు విధించారు. మూడేళ్లలో వరుసగా 30 శాతం అడ్మిషన్లతో పాటు సంబంధిత కోర్సుల్లో ఇద్దరు డాక్టరేట్ కలిగిన ప్రొఫెసర్లు ఉంటేనే హానర్స్ కోర్సుల బోధనకు అనుమతి మంజూరు చేస్తారు.

డిగ్రీ కళాశాలలు ఇలా..

జిల్లా	ప్రభుత్వ	ప్రైవేట్	అటానమస్
కోనసీమ	07	45	01
తూర్పు	06	40	01
కాకినాడ	05	46	03

కొనసాగుతున్న అడ్మిషన్ల ప్రక్రియ

2023-24 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ నెల 19 నుంచి 24 వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూడా పూర్తి చేసుకున్నారు. ఈ నెల 26 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్లను విద్యార్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. జూలై 3న అడ్మిషన్లు కేటాయించి, 4వ తేదీ నుంచి డిగ్రీ తరగతులు నిర్వహించనున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

మరో ఇద్దరికి రూ.10 వేల చొప్పున జరిమానా

జగ్గంపేట: మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురిని కోర్టులో హాజరు పరచగా ఇద్దరికి జైలు శిక్ష, మరో ఇద్దరికి రూ.20 వేలు జరిమానా విధించినట్లు జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. జగ్గంపేటలో రాత్రి సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా బి.రంజిత్, యు.శ్రీను, డి.వీరబాబు, ఎన్.గుర్రయ్య మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టు పడ్డారని తెలిపారు. వీరిని పెద్దాపురం కోర్టులో మంగళవారం హాజర పరచగా మేజిస్ట్రేట్ జి.హర్షవర్ధన్ బి.రంజిత్, యు.శ్రీనులకు రూ.10వేల చొప్పున జరిమానా విధించారని తెలిపారు. డి.వీరబాబుకు రెండు రోజులు, ఎన్.గుర్రయ్యకు ఐదురోజులు జైలు శిక్ష విధించారని వివరించారు.

ప్రేమ పేరుతో మోసగించిన యువకుడిపై పోక్సో కేసు

నిడదవోలు రూరల్: మండలంలోని కోరుమామిడి గ్రామానికి చెందిన బాలిక (17)ను ప్రేమపేరుతో మోసం చేసిన బట్టు నరేంద్ర అనే యువకుడిపై పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ బుధవారం తెలిపారు. కోరుమామిడి గ్రామానికి చెందిన బట్టు లక్ష్మి కుమారుడు నరేంద్ర అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ పర్యవేక్షణలో విచారణ చేపడుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింపు



అక్రమంగా రవాణా చేస్తున్న ఎద్దులు, ఆబోతులు

అమలాపురం టౌన్: వధ కోసం 12 ఎద్దులు, రెండు ఆబోతులను తరలిస్తున్న రెండు వ్యాన్లను 216 ఎన్‌హెచ్ బైపాస్ రోడ్డులో బీజేపీ నాయకులు మంగళవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. అందులో కుక్కేసి ఉన్న ఒక ఎద్దు చనిపోయి ఉంది. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో కొందరు పార్టీ నాయకులు రెండు వ్యాన్లతో పాటు అందులో ఉన్న నలుగురిని పోలీసులకు అప్పగించారు. వ్యాన్లను అమలాపురం డీఎస్పీ కార్యాలయానికి తరలించి ఫిర్యాదు చేశారు. వ్యాన్లలో ఉన్న నలుగురు వ్యక్తులు విజయనగరం జిల్లా గుర్ల గ్రామానికి చెందిన యాండ్రపు రమేష్, గురుజా చిన్నారావు, తడవలస రామకృష్ణ, శువ్వాడ గణేష్‌ను పోలీసులు విచారించారు. తుని నుంచి చిలకలూరుపేటకు ఆ పశువులను వధ (కటింగ్) కోసం రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఆ వ్యాన్లు, పశువులను డీఎస్పీ అంబికా ప్రసాద్ పరిశీలించారు. పశువులను శ్రీ గౌతమ మహర్షి గో సంరక్షణ సమితి గోశాలకు తరలించారు. రెండు వ్యాన్లను సీజ్ చేసి, నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. చనిపోయిన ఎద్దును ఖననం చేయించారు. అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు పర్యవేక్షణలో రూరల్ ఎస్సై ఎ.పరదేశి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతు నేస్తం పథకంలో రూ.8 లక్షల రుణం

డీసీసీబీ చైర్మన్ ఆకుల



డీసీసీబీ మహాజన సభలో మాట్లాడుతున్న చైర్మన్ వీర్రాజు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): రైతు నేస్తం పథకం ద్వారా ఎకరా భూమి ఉన్న రైతుకు రూ.8 లక్షల వరకూ రుణం అందించనున్నట్లు డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు తెలిపారు. కాకినాడలో బుధవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ 126వ మహాజన సభ జరిగింది. వాణిజ్య బ్యాంకులకు దీటుగా డీసీసీబీ ద్వారా రైతులకు కావాల్సిన అన్నీ రుణాలు అందించేందుకు చర్యలు తీసుకొంటున్నామన్నారు. నష్టాల్లో ఉన్న డీసీసీబీ లాభాల బాటలో పయనిస్తుందన్నారు. రికవరీ శాతం భారీగా పెరగడంతో బ్యాంకు లాభాల్లో ఉందన్నారు. రైతులకు పంట రుణాలతోపాటు, బంగారు నగలపైన, ఇళ్లు నిర్మించుకొనేందుకు, రైతుల పిల్లలకు విద్యారుణాలు సైతం ఇస్తామన్నారు. ఇటీవల కేరళ రాష్ట్రంలోని పలు సహకార సంఘాల పనితీరు పరిశీలించానని, అక్కడ అమలు చేస్తున్న విధానాలు ఇక్కడ అమలు చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పలువురు సహకార సంఘ సభ్యులు రుణాలు ఇచ్చేందుకు అడ్డంకిగా ఉన్న సిబిల్ స్కోర్ విధానం తీసివేయాలని, సహకార సంఘాలు ద్వారానే రూ.20 లక్షలు రుణాలు ఇవ్వాలని, సహకార సంఘాలకు రుణ పరిమితి పెంచాలని కోరారు. డీసీసీబీ సీఈఓ ఆర్‌వీ నరసింహారావు బ్యాంకు ప్రగతిని వివరించారు. డీసీసీబీ పాలక వర్గ సభ్యులు పోలిశెట్టి సోమరాజు, ఇళ్ల సత్యగోపాలకృష్ణ, బండారు సత్తిరాజు, పంతం గంగాభవానీరామ్, సయ్యద్ మెహిద్దీన్, పులి మధుసుధాకర్‌బాబు, సహకార సంఘ అధ్యక్షులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కొట్టేసిన నేరానికి.... కొన్న పాపానికీ...

- బైక్ దొంగల ఐదుగురితో పాటు కొన్న తొమ్మిది మంది అరెస్టు
- రూ.20.70 లక్షల విలువైన 41 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడిన ఐదుగురితోపాటు వాటిని కొనుగోలు చేసిన తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను ఎస్పీ సతీష్‌కుమార్ బుధవారం కాకినాడలోని తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడుకు చెందిన కొమిరిశెట్టి వీరబాబు, బొర్రంపాలేనికి చెందిన సుభాసా నిరాజు పొలం గట్లపై నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలను నకిలీ తాళంతో తీసి దొంగిలించేవారు. భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్న వీరిద్దరూ సునాయాసంగా డబ్బు సంపాదించే లక్ష్యంతో ఈ దొంగతనాలకు పాల్పడ్డారు. వీరు దొంగిలించిన 11 వాహనాలను యర్రవరానికి చెందిన ఉమ్మిడి దుర్గ, రంగంపేటకు చెందిన కానూరి శ్రీను, నందరాడకు చెందిన బడిదబోయిన దుర్గాప్రసాద్, బొర్రంపాలేనికి చెందిన గల్లా వెంకటేసులుకు విక్రయించారు. ఇద్దరు దొంగలతో పాటు వాహనాలు కొన్న నేరానికి కొన్న నలుగురిని గండేపల్లి పోలీసులు అరెస్టు చేశారు. మరో కేసులో అన్నవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 30 వాహనాలను రికవరీ చేశారు. ఈ వాహనాలను ఉప్పాడ కొత్తపల్లి గ్రామానికి చెందిన పట్నాల సాయి వెంకట్, డొప్పా దుర్గాప్రసాద్, బడ్జెట్ ఆదిత్య దొంగిలించారు. వీటిని అనకాపల్లి జిల్లా నక్కపల్లికి చెందిన బద్ద రవి, మసా శివకుమార్, ఉగ్గిన చిట్టిబాబు, సరికొండ వెంకటసాయి, గంటి నాగేశ్వరరావు కొన్నారు. దీంతో దొంగిలించిన ముగ్గురితో పాటు కొన్న ఐదుగురిని అరెస్ట్ చేశారు. రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలో రూ.20.70 లక్షలు విలువ చేసే 41 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకున్న పోలీస్ బృందాలను ఎస్పీ అభినందించారు.

నేడు 55 పీజీటీ పోస్టులకు కౌన్సెలింగ్

రాయవరం, బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 55 పోస్టు గ్రాడ్యుయేషన్ టీచర్స్ (పీజీటీ) పోస్టులకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులుగా పనిచేస్తూ రెండు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసినవారు, పీజీలో 50 శాతం ఉత్తీర్ణత సాధించి, సంబంధిత సబ్జెక్టుల్లో బీఈడీ మెథడాలజీ ఉన్నవారు పీజీటీగా పనిచేసేందుకు అర్హులు. పీఎస్ హెచ్‌ఎంగా పనిచేసే ఉపాధ్యాయులు పీజీటీ పోస్టులకు అనర్హులు. పీజీటీగా పనిచేసేందుకు అర్హత కలిగి ఉండి, ఆసక్తి ఉన్నవారు కాకినాడ సమగ్ర శిక్షా సమావేశపు హాలులో మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీఈవో అన్నపూర్ణ తెలిపారు. బోటనీ-11, జువాలజీ-12, కెమిస్ట్రీ-15, ఫిజిక్స్-11, సివిక్స్-3, కామర్స్, ఎకనామిక్స్, తెలుగు ఒక్కొక్క పీజీటీ పోస్టుకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

యానాం: యానాం పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సీఐ షణ్ముగం, ఎస్ఐ శేరు నూకరాజు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక హైస్కూల్ రోడ్డులో గ్రంథాలయం వెనుక ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి యానాంకు చెందిన పెమ్మాడి శ్యామలకుమార్, నాతి రాజేష్‌లను అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి 6 ప్యాకెట్లలోని 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గంజాయిని మైనర్‌బాలురకు సైతం అమ్ముతున్నట్లు తమ విచారణలో తెలిసిందన్నారు. నిందితులిద్దరూ డ్రగ్స్‌కు సైతం అలవాటుపడ్డారని, గంజాయిని కాకినాడ, తుని ప్రాంతాల్లో కొనుగోలు చేసి యానాం రీజియన్‌లో అమ్ముతున్నారన్నారు. వీరిద్దరిని సబ్‌కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారన్నారు.

నేడు జిల్లా స్థాయి యువ ఉత్సవం

యానాం: కేంద్ర క్రీడా, యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం యానాం శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్థాయి యువ ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో యువతీయువకులకు డ్రాయింగ్, కవిత్వం, కల్చరల్, మొబైల్ ఫొటోగ్రఫీ తదితర పోటీలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా పుదుచ్చేరి రాజ్యసభ సభ్యుడు సెల్వగణపతి, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు వస్తున్నారని తెలిపారు.

గుర్తింపు ఉన్న పాఠశాలల్లోనే చదివించండి

సీబీఎస్ఈ పాఠశాలల జాబితా విడుదల చేసిన డీఈవో

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలో కొన్ని యాజమాన్యాలు సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్ బోధించేందుకు అనుమతి లేకపోయినా విద్యార్థులను నమ్మించి చేర్చుకుంటున్నారని, దీనిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం బుధవారం తెలిపారు. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్ ఉన్న పాఠశాలల వివరాలను అందిస్తున్నామని, తల్లిదండ్రులు ఆ విద్యాసంస్థల్లోనే పిల్లలను చేర్పించాలని తెలిపారు.

2023-2024 విద్యాసంవత్సరంలో సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్ అందిస్తున్న పాఠశాలలు

షిర్డీ సాయి విద్యానికేతన్ (ఇంగ్లిష్ మీడియం) కడియం, లారెల్ హైస్కూల్, కోరుకొండ, ఏకేఆర్‌జీ ప్రాథమికోన్నత పాఠశాల (ఇంగ్లిష్ మీడియం, నల్లజర్ల), ఎకేఆర్‌జీ ఉన్నత పాఠశాల (ఇంగ్లిష్ మీడియం), నల్లజర్ల, బెతెస్త క్రిస్టియన్ అకాడమీ, నల్లజర్ల, ఇంటర్నేషనల్ ఢిల్లీ హైస్కూల్, (ఇంగ్లిష్ మీడియం) ప్రకాశరావుపాలెం, నల్లజర్ల, ఏకేఆర్‌జీ ఉన్నత పాఠశాల, (ఇంగ్లిష్ మీడియం) నిడదవోలు, శశి హైస్కూల్, (ఇంగ్లిష్ మీడియం) కానూరు, పెరవలి, లోటస్ హైస్కూల్, (ఇంగ్లిష్ మీడియం), బుచ్చయ్య నగర్, రాజమహేంద్రవరం రూరల్, త్రిపుర (ఇంగ్లిష్ మీడియం), పిడింగొయ్యి, రాజమహేంద్రవరం రూరల్, సెయింట్ ఆన్స్, రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం అర్బన్, శ్రీ సత్యసాయి గురుకులం హైస్కూల్, (ఇంగ్లిష్ మీడియం) రాజమహేంద్రవరం అర్బన్, శ్రీ పకాష్ హైస్కూల్, (ఇంగ్లిష్ మీడియం) దివాన్ చెరువు, రాజానగరం, శ్రీ ప్రకాష్ ప్రైమరీ స్కూల్, (ఇంగ్లిష్ మీడియం) దివాన్ చెరువు, రాజానగరం, శశి హైస్కూల్, (ఇంగ్లిష్ మీడియం) వేలివెన్ను, ఉండ్రాజవరం, ఓక్ వుడ్స్ ప్రైమరీ స్కూల్, (ఇంగ్లిష్ మీడియం) దివాన్ చెరువు, రాజానగరం, ఓక్ వుడ్స్ హైస్కూల్, (ఇంగ్లిష్ మీడియం) దివాన్ చెరువు, రాజానగరం, భారతీయ విద్యా భవన్ ప్రాథమికోన్నత పాఠశాల, (ఇంగ్లిష్ మీడియం), నామవరం.

రిజర్వ్ బ్యాంక్ క్విజ్ పోటీకి అనూహ్య స్పందన



విజేతలైన విద్యార్థులతో బ్యాంకు, విద్యాశాఖాధికారులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): భారత రిజర్వ్ బ్యాంకు ఆర్థిక సమీకృత అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న క్విజ్ పోటీలకు అనూహ్య స్పందన లభించిందని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ డీవీ ప్రసాద్ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించి బుధవారం విజేతలకు బహుమతులను అందచేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు ఆర్థిక వనరులు, అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో ఆల్ ఇండియా ఫైనాన్షియల్ లిటరసీ పై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూచనలను అనుసరించి క్విజ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు అందరికీ సాధారణ పొదుపు వివరాలు, ఆదాయ, వ్యయాలు, బేసిక్ బ్యాంకింగ్, డిపాజిట్లు, డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డులు, చెక్ బుక్, వివిధ రకాల బ్యాంకు ఖాతాలు, బ్యాంకుకు సంబంధించిన మౌలిక భావనలు, ఈ మధ్య విపరీతంగా ఉపయోగిస్తున్న డిజిటల్ పేమెంట్స్ అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండేలా ఈ క్విజ్ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. కార్యక్రమానికి పరిశీలకులుగా అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ వ్యవహరించారు. 18 మండలాల్లోని పాఠశాలల నుంచి స్కూల్‌కి ఇద్దరు చొప్పున 36 మంది విద్యార్థులు, ఒక గైడ్ టీచర్ క్విజ్‌లో పాల్గొన్నారు. ప్రథమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.7 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలు విద్యార్థుల ఖాతాలో జమ కానున్నాయని డీఐ దిలీప్‌కుమార్ తెలిపారు. జిల్లా స్థాయి లో ప్రథమ బహుమతి పొందిన ఇద్దరు విద్యార్థులు వచ్చేనెల 14 న విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ జి.శ్రీధర్, రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

15 వరకు ఉత్తమ ఉపాధ్యాయ దరఖాస్తుల స్వీకరణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చేనెల 15వ తేదీ వరకు సమయం ఉందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం బుధవారం తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లాపరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్, పురపాలక యాజమాన్యాలు గల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేసే అన్ని కేటగిరీలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు 'జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ 2023కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తిగలవారు నేషనల్ అవార్డ్స్ టు టీచర్స్ 2023 వెబ్‌సైట్ ద్వారా వచ్చేనెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో ప్రతిపాదనలు సమర్పించాలన్నారు.